వరద గట్లు కోత..
రైతుకు గుండె కోత


ఇటీవల తుపాను వర్షాలకు కోతకు గురైన పిరికి మదుం గట్టు (నేడు)


గతంలో గట్టుకు రైతులు చేసుకున్న తాత్కాలిక మరమ్మతులు (నాడు)

- 300 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- వర్షాలకు కొట్టుకుపోయిన సాగునీటి కాలువ గట్టు
- ఆవేదనలో మూడు గ్రామాల రైతులు

మాకవరపాలెం : సాగునీరు అందక వరి రైతులు ఆవేదన చెందుతున్నారు. కోతకు గురైన కాలువ గట్టుకు మరమ్మతులు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కొండలఅగ్రహారం వద్ద ఉన్న సర్పానది నుంచి ఇక్కడి మెరక, పల్లపు కాలువల ద్వారా ఏటా ఖరీఫ్‌లో మాకవరపాలెం, తామరం, నారాయణరాజుపేట గ్రామాల భూములకు సాగునీరు అందుతుంది. అయితే ఈ కాలువల మధ్యలో ఉన్న మదుములకు ఏర్పాటు చేసిన గేట్లతోపాటు గట్లు చాలా కాలంగా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆయకట్టు భూములకు సక్రమంగా నీరు అందడం లేదు.

ఎండిపోతున్న వరిపొలాలు..
వర్షాలకు కొట్టుకుపోయిన గట్టు కారణంగా వరిపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించడంతో ఎంతో ఉత్సాహంగా వరి నాట్లు వేశారు. తీరా వర్షాలకు పిరికి మదుం వద్ద గట్టు కొట్టుకుపోవడంతో సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. తమ సమస్యపై ఏళ్లతరబడి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని రైతులు తెలిపారు. కొట్టుకుపోయిన గట్టుకు వెంటనే మరమ్మతులు చేయకపోతే వరి పంట పూర్తిగా నష్టపోతామని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రెండేళ్లుగా రైతులకు తప్పని ఇబ్బందులు..
మెరక, పల్లపు కాలువలకు నీటిని మళ్లించే మదుమునకు ఉన్న గేట్లు తుప్పుపటి శిథిలావస్థకు చేరాయి. అలాగే మరోచోట నీటిని మళ్లించే పిరికి మదుం వద్ద కూడా గట్టు కోతకు గురైంది. రెండేళ్లుగా ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చేసేది లేక రైతులే కోతకు గురైన పిరికి మదుం గట్టు వద్ద రేకులు, ఇసుక, రాయి బస్తాలను అడ్డుకట్టగా వేసుకుని నీరు వృథా కాకుండా చేసుకుని నీటిని మళ్లించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పిరికి మదుం వద్ద రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకున్న గట్టు పూర్తిగా కొటుకుపోవడంతో సాగునీరు వృధాగాపోతోంది.

క్లుప్తంగా

కోతకు గురైన తాచేరు 'వరద గట్టు


వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కోతకు గురవుతున్న వరద గట్టు

మాడుగుల రూరల్ : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున వరద గట్టు కోతకు గురియగుతుంది. సుమారు 200 మీటర్ల మేర వరద గట్టు కోతకు గురికావడం వల్ల రహదారి కూడ కోతకు గురికా వచ్చునని సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి, యుద్ధ ప్రాతిపదిక మీద వరద గట్టు కోతకు గురికాకుండా మరమ్మతులు చేపట్టాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

మాకవరపాలెం : వేతన బకాయిలు చెల్లించాలని మండలంలోని జీకోడూరు పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. సోమవారం ఎంపీడీవో చాయాసుధకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ నుంచి తమకు వేతనాలు అందజేయలేదన్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బకాయి వేతనాలు అందజేయాలని వారు కోరారు.

ఏఎల్‌పురంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

గొలుగొండ : ఏఎల్‌పురం గ్రామంలో రక్తదాన శిబిరంలో యువకులు భారీ గా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏఎల్‌పురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎల్‌పురం, పాతకృష్ణదేవిపేట, కొంకసింగి, నాగాపురం, లింగంపేట తదితర గ్రామాల నుండి 90 మంది యువకులు రక్తదానం చేయడం జరిగింది. నర్సీపట్నానికి చెందిన జనసేన నాయకులు అప్పల దొర బాబు, అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ స్టాక్ పాయింట్ మంజూరుపై హర్షం

రోలుగుంట : తమ గ్రామాలకు అనువుగా రేషన్ సరుకులు అందించేందుకు స్టాకు పాయింట్ మంజూరు చేయాలని అర్ల పంచాయతీ కొండ శిఖరాగ్ర గ్రామాల ప్రజల విజ్ఞప్తికి అధికారులు స్పందించారు. వారందరికీ అనువుగా ఉండే వైబీపట్నంలో రేషన్ స్టాక్ పాయింటును మంజూరు చేశారు. దీనిపై అయా గిరిజన గ్రామాలైన పెదగరువు, లోసింగి, పాతలోసింగి, పీత్రగెడ్డ, నీలిబంద గ్రామ స్తులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి: నేత్ర దానం చేసి మరో ఇద్దరికి చూపును ప్రసాదిద్దామని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ అన్నారు. ఈ మేరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి వనజ మాట్లాడుతూ నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు ప్రసాదించే అవకాశం లభిస్తుందన్నారు. నేత్ర దానంపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి కలిగే ప్రయోజనాలను వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆప్తమాలిక్ ఆఫీసర్ భవానీ, సిహెచ్‌వో ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎం మరియమ్మ పాల్గొన్నారు.

స్వయంభూ వినాయకుడ్ని దర్శించుకున్న ధర్మశ్రీ


స్వామిని దర్శించుకుంటున్న కరణం ధర్మశ్రీ

చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే, యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ సోమవారం పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి రావుఆధ్వర్యంలో పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఇక్కడ సమీపంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల నిలువెత్తు వినాయకుడిని ధర్మశ్రీ దర్శించుకున్నారు. అనంతరం పీఎస్‌పేటలో లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో జరిగిన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుత్రేవు శ్యామ్‌ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, వెంకట్రావు, మండల అధ్యక్షుడు వెంకట్రావు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు చవితిన బాబూరావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

మాడుగుల : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగులను రెగ్యులర్ చేసి గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలంటూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి గాదిరాయి గ్రామంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎస్ఏ, మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డేటా ఎంట్రీ కోఆర్డినేటర్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లుగా, పీఈటీలుగా కేజీబీవీల్లో ఎస్‌వోలుగా, ఐఈఆర్‌టీలుగా, సీఆర్‌పీలుగా, ఒకేషనల్ టీచర్లుగా పనిచేస్తున్న తమకు రెగ్యులర్ చేసేలేదని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఎంటీఆర్ లేదని, ఉద్యోగ విరమణ తర్వాత గ్రాట్యూటీ అయినా చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరాజారామ్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 30 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం : ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్ అధికారులకు సూచించారు. ఆర్డీవో వి.వి.రమణ ప్రభుత్వ కార్యక్రమాల దృష్ట్యా హాజరు కాకపోవడంతో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఏవో సుధాకర్, నర్సీపట్నం తహసీల్దార్ రామారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 30 అర్జీలు వచ్చాయని వారు తెలిపారు. పెదబొడ్డేపల్లి మదుం వద్ద తూరల తయారీ కేంద్రం ఉంది. తయారు చేసిన తూరలను రోడ్డు మీద వేయడం వల్ల రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని కె.కాంతం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. డి-పట్టా భూమిని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాం.. పట్టాలు కూడా ఉన్నాయి.. వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లు లేవని కోటవురట్ల మండలం, యండపల్లి గ్రామానికి రామయ్యమ్మ, లక్ష్మి ఫిర్యాదు చేశారు. డీఎల్‌డీవో నాగలక్ష్మి, సీడీపీవో జి.వి.రమణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అన్న సమారాధనలు


కె.జె.పురం దిబ్బవీధిలో అన్న సమారాధన

రావికమతం : వర సిద్ధి వినాయక నవరాత్రుల్లో భాగంగా రావికమతం యూత్ స్టార్స్ అధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన జరిపారు. యూత్ స్టార్స్ ఆధ్వర్యంలో 25 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 25 వంటకాలతో అన్న సమారాధన జరిపారు. సమీప గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరైన అన్నప్రసాదం స్వీకరించారు. దొండపూడిలో వరసిద్ది వినాయక యూత్ ఆధ్వర్యంలో మట్టా వారి వీధిలో అన్న సమారాధన జరిపారు.
మాడుగుల రూరల్: కె.జె.పురంలో టెంట్ హౌస్ రాము ఇంటి వద్ద గత 46 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జరిగిన ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం స్వామి వారిని నిమజ్జనం చేశారు. ఈ గ్రామంలో కోనేరు సమీపంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.
కె.కోటపాడు : చౌడువాడలో ధనిమిశెట్టి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు జరిపారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి


మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం వాడవాడలా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహానేత అకాల మరణం పొంది నప్పటికీ నేటికీ ప్రజల్లో హృదయాలలో సజీవంగా ఉన్నారన్నారు. ఆయన పేరు మీద పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.
మాడుగుల రూరల్: దివగంత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 16 వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని, కె.జె.పురంలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పించనున్నట్టు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీశ్రేణులంతా హాజరుకావాలన్నారు. సత్యవరం గ్రామంలో వైఎస్సార్ 16వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ సోమవారం రాత్రి తెలిపారు. సత్యవరంలో గల సచివాలయం వద్ద వైఎస్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరవ్వాలన్నారు.
నాతవరం : మండలంలో మంగళవారం దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు నాతవరం ప్రధాన కూడలిలో గల వైఎస్సార్ విగ్రహనికి పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అందరూ విచ్చేయాలన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి


K.జె.పురంలో ఆటో కార్మికుల నిరసన

మాడగుల రూరల్ : స్త్రీ శక్తి పథకం ద్వారా ఉపాధి కోల్పోయిన ఆటో వర్కర్సుకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని, కె.జె.పురం మోదమాంబ ఆటో వర్కర్సు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కె.జె.పురం చెరకు కాటా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆటోవర్కర్సు యూనియన్ అధ్యక్షుడు ఆడారి వెంకట సూరిప్పారావు సారథ్యం వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి, ఆదుకోవాలని, ప్రతి ఏటా వాహనమిత్ర కింద ప్రతి ఆటో వర్కర్‌కు రూ. 25వేలు ఆర్థిక సహాయం అందించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, జీవో నెంబరు 21 రద్దు చేయాలని, బ్యాంకుల ద్వారా రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణం అందజేయాలని కోరారు.

అభ్యంతరాలను తెలియజేయాలి

మాకవరపాలెం : భూముల రీసర్వేలో అభ్యంతరాలను తెలియజేయాలని డీటీ నూకరాజు రైతులకు సూచించారు. మండలంలోని పైడిపాల, లచ్చన్నపాలెంలో గ్రామాల్లో ఇప్పటికే భూముల రీ సర్వే పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ సర్వే వివరాలను రైతులకు వివరించారు. అభ్యంతరాలను తెలియజేస్తే విచారణ చేసి సరి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, సర్వేయర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగరాజేశ్వరి సేవలు అభినందనీయం


క్రాఫ్ట్ టీచర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మాడుగుల: గాదిరాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 12 ఏళ్లుగా క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలుగా విద్యార్థులను తీర్చిదిద్దిన దొండపాటి రాజేశ్వరి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం మండలంలో గాదిరాయి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్ రాజేశ్వరికి ఏర్పాటు చేసిన పదవీ విరమణ సభలో పాల్గొని మాట్లాడారు. రాజేశ్వరిని దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం గాదిరాయి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అంగన్‌వాడీలో అందజేస్తున్న పథకాలు పరిశీలించారు. కేంద్రాల్లో అందజేస్తున్న సేవలు అభినందనీయమని అంగన్‌డీ వర్కర్లు రమ, సూర్యమణితో పాటు ఆయాలును ఆయన అభినందించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా బాల సంజీవని కిట్స్ చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకట రాజారామ్, సర్పంచ్ జగన్నాథరావు, ఎంఈవో ఈశ్వరరావు, హెచ్ఎం నాగేశ్వరరావ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న నూకరాజు మాస్టర్, గ్రామ నాయకులు

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన ధర్మ ప్రచారకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బేతా నూకరాజు మాస్టారు జన్మదిన వేడుకలను కొత్తకోట పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయనను స్థానిక నాయకులు శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మాస్టారు గ్రామంలో చేసిన పలు సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం నూకరాజు మాస్టారు పలువురు పారిశుధ్య కార్మికులకు, వీఆర్ఏలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల గుర్తింపు శిబిరం


ఉపాధ్యాయులు మహాలక్ష్మీ నాయుడు, జగన్నాథనాయుడు

రావికమతం : దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల గుర్తింపు నిర్ధారణ శిబిరం ఈ నెల 3వ తేదీన చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్ష ఆల్మికో సంస్థ సంయుక్తంగా చోడవరం హైస్కూల్లో ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని రావికమతం, రోలుగుంట, చోడవరం, బుచ్చెయ్యపేట మండలల్లో గల 0 నుంచి 18 సంవత్సరాల లోపు పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ ప్రతం, ఆధార్‌కార్డ్, రేషన్ కార్డ్, ఐడీ కార్డ్, రెండు ఫొటోలు తీసుకుని రావాలని, వారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నారని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు వైద్య నిర్ధారణ పరీక్షల అనంతరం వారికి అవసరమైన పరికరాలను అందజేస్తారని తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

రోలుగుంట : ప్రతి ఏడాది మాదిరిగానే కుసుర్లపూడి యువత గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు అభిషేకాలు జరిపారు. వారికి ప్రసాద వితరణ చేశారు. లడ్డూకు వేలంపాట నిర్వహించారు. పలువురు మహిళలు ముగ్గుల పోటీల పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. మాజీ సర్పంచ్ గండి తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

కలిగొట్ల హైస్కూల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలి


వినతి ప్రతం అందిస్తున్న వెంకన్న

దేవరాపల్లి: కలిగొట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు శ్మశాన వాటిక మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, ప్రత్యామ్నాయంగా రోడ్డు సౌక ర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

మాడుగులలో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం


సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్

మాడుగుల: మాడుగులలో నూతనంగా రూ. 5.23 కోట్లతో నిర్మాణం చేపట్టిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రిలో సౌకర్యాలతో పాటు పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తామన్నారు. పాండవుల గుడి వద్ద డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో రూ.కోటి 10 లక్షలతో 8 తరగతి గదులు నిర్మాణానికి సోమవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు , కలెక్టర్ విజయకృష్ణన్, ఎంపీపీ రాజారామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఆస్పత్రి వైద్యాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు అవగాహన అవసరం


ఎ.కోడూరులో ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

కె.కోటపాడు : ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. ఎ.కోడూరులో సోమవారం ఎయిడ్స్ వ్యాధిపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని జరిపారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, లింక్ వర్కర్ రేవతి పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో పైప్‌లైన్ల మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..


మురుగు కాలువలో పైపును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నాతవరం: మండలంలో కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో తాగునీటి పైపులైను పనులు అధికారులు చేపట్టారు. ఆగస్టు 31వ తేదీన 'రోగాల బారిన మోడల్ కాలనీ' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సోమవారం ఇందిరమ్మ మోడల్ కాలనీలో పనులు చేపట్టారు. కలుషిత నీటికి కారణమవుతున్న పైపులైనును తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. తాగునీటి పథకంలో నీటిని క్లోరినేషన్ చేసి పైకప్పు ఏర్పాటు చేశారు. పనులను డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు పర్యవేక్షించారు.

'గొలుగొండ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయండి..'

రావికమతం : ఆదివాసీలకు అన్యాయం చేస్తూ రికార్డులను తారుమారు చేస్తున్న గొలుగొండ తహసీల్దార్ పి.శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని, రెవిన్యూ విజిలెన్స్ విభాగం ఆదేశాల మేరకు విచారణ అధికారిని జిల్లా కలెక్టర్ నియమించాలని, పాత మల్లంపేట ఆర్వోఆర్ దస్త్రాలను వెంటనే స్వాధీన పర్చుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారురావు డిమాండ్ చేశారు. వలసలపాలెం గ్రామంలో ఏపీ ఆదివాసీ సంఘం ఏడు మండలాల కార్యకర్తల సమావేశం జిల్లా కన్వీనర్ మోసూరు రాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బంగారురావు మాట్లాడుతూ తహసీల్దార్ అక్రమాలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈనెల 4వతేదీ నుంచి నిరసనలు ఉధృతం చేస్తామన్నారు.